క్లుప్తంగా

నాణ్యమైన మొక్కలు పెంచాలి



అయిజ: నర్సరీల్లో నాణ్యమైన మొక్కలు పెంచాలని ఎంపీడీఓ వెంకటయ్య అన్నారు. మండలంలోని ఉప్పల, ఉప్పల క్యాంపు గ్రామాల్లోని నర్సరీలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీ నిర్వాహకులతో మాట్లాడారు. బలహీనంగా ఉన్న మొక్కలు తొలగించి, నాణ్యమైన మొక్కలను పెంచాలన్నారు. అదే విధంగా ఈజీఎస్ పనులు, రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మసీదుకు విరాళం

అలంపూర్: పట్టణంలోని ఆలంగీర్ తుట్టి మసీదుకు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నవాబ్ ఆసిఫ్ ఖాన్ శుక్రవారం రూ.20 వేల నగదు, 10 బస్తాల సిమెంట్ విరాళంగా అందజేశారు. మత పెద్దలు మూత్రశాలల నిర్మాణం కోసం తనను సంప్రదించగా తక్షణ సాయం అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడిని శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



గద్వాలటౌన్: ఈనెల 23న హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు స్థానిక ప్రభుత్వ బాలురు ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా జట్టు తరపున పాల్గొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం విద్యార్థులు చరణ్, ధర్మ, రవిలను హెచ్‌ఎం ఇమ్మానియేల్, పీడీ హైమావతి, బీసన్న అభినందించారు.

వెంకటాపురంలో వైద్య శిబిరం



అయిజ: మండలంలోని వెంకటాపురం స్టేజిలో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ విష్ణు పరిశీలించారు. కాలినడకన వెళ్తున్న భక్తులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపులో వడ్డేపల్లి భక్తులు

శాంతినగర్: కర్నూలు జిల్లా మంత్రాలయం గురురాఘవేంద్ర స్వామి హుండీ లెక్కింపులో వడ్డేపల్లి మండలానికి చెందిన భక్తులు పాల్గొని సేవలందించారు. శాంతినగర్, వడ్డేపల్లి మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన గురు రాఘవేంద్రస్వామి భక్త బృందం శుక్రవారం లెక్కించిన హుండీ లెక్కింపులో స్వచ్ఛందంగా పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎర్రవల్లి: మండల పరిధిలోని పుటాన్‌దొడ్డి గ్రామానికి చెందిన బల్గరి సవరమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ శుక్రవారం వారి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5000 ఆర్థిక సహాయం చేశారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గద్వాల: కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం ధరూరు మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు.. ధరూరు మండలం అల్వాలపాడుకు చెందిన కుర్వ గోవర్ధన్ తల్లిదండ్రులతో ఆస్తి వాటాలపై ఘర్షణ పడ్డారు. దీంతో మనస్థాపానికి గురైన గోవర్ధన్ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లగా, పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

ప్రమాదభరితంగా రహదారులు

- రోడ్లపై ఏర్పడిన గుంతలతో ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



గుంతలమయంగా బిజ్వారం- గద్వాల రహదారి

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారులు ప్రమాదభరితంగా మారాయి. బిజ్వారం నుంచి గద్వాల, మల్దకల్ నుంచి గట్టు, తాటికుంట స్టేజి నుంచి తప్పెట్ల మొర్సు, మల్దకల్ నుంచి ఎల్కూర్, మల్లెందొడ్డి నుంచి విఠలాపురం గ్రామాల రహదారులపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రోడ్లపై ఏర్పడిన గుంతలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నట్లు పేర్కొన్నారు. అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదభరితంగా ఉన్న రోడ్లకు మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రమాదాలు జరిగినా పట్టింపు లేదు



సద్దలోనిపల్లి- నేతువానిపల్లి రోడ్డుపై గుంతలు ఏర్పడి వాహనదారులు నిత్యం వాహనదారులు ప్రమాదాల బారిన పడి మృతి చెందుతున్నారు. అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. రోడ్డుకు మరమ్మతు చేపట్టి సమస్య పరిష్కరించాలి.

–తిమ్మన్న, అమరవాయి

గుంతలతో ఇబ్బందులు



బిజ్వారం నుంచి గద్వాలకు వెళ్లే రహదారిలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. 15 ఏళ్ల క్రితం నిర్మించిన బీటీ రహదారికి మరమ్మతు చేపట్టకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఉన్నతాధికారులు రోడ్డు సమస్యలపై చర్యలు తీసుకోవాలి.

– గోవిందు, బిజ్వారం

సమస్యలు పరిష్కరిస్తాం



మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారుల్లో ఏర్పడిన గుంతలకు మరమ్మతు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే రహదారులను పరిశీలించి నివేదికలను జిల్లా ఉన్నతాధికారులకు అందజేశాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడుతాం.

–బషీర్, పంచాయతీరాజ్ ఏఈ

ఆశా కార్యకర్తల డిమాండ్లు పరిష్కరించాలి



వడ్డేపల్లి పీహెచ్‌సీ ఎదుట నిరసన తెలుపుతున్న ఆశా కార్యకర్తలు

ఇటిక్యాల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట శుక్రవారం ఆశా కార్యకర్తలు డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వేళ ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం రూ.18వేల వేతనం, రూ.50 లక్షల ఇన్సూరెన్స్ ఇవ్వాలన్నారు. ఏఎన్‌ఎం ట్రెనింగ్ పూర్తిచేసిన ఆశాలకు ఏఎన్‌ఎం పోస్టుల్లో ప్రమోషన్ కల్పించాలని కోరుతూ డిమాండ్ చేశారు. అనంతరం మండల వైద్యాధికారి డాక్టర్ రాధికకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆశాలు సరస్వతమ్మ, యశోద, సువార్త, శారదమ్మ, జ్యోతి, రాజేశ్వరి పాల్గొన్నారు.

శాంతినగర్: రాష్ట్ర ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని వడ్డేపల్లి పీహెచ్‌సీ ఎదుట మండల ఆశా కార్యకర్తల అధ్యక్షురాలు అనసూయ ఆధ్వర్యంలో ఆశాలు నిరసన చేపట్టారు. కార్యకర్తల డిమాండ్లు నెరవేర్చాలని, లేని పక్షంలో నిరసనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పురాతన బావిని సంరక్షించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గద్వాల పరిరక్షణ సమితి నాయకులు

గద్వాల: నలసోమనాద్రి సంస్థానాధీశుల కాలంలో నిర్మించిన బావిని కబ్జాదారులు ఆనవాలు లేకుండా చేస్తున్నారని గద్వాల పరిరక్షణ సమితి నాయకులు కలెక్టర్ బీఎం సంతోష్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం కలెక్టరేట్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. మాజీ మున్సిపల్ చైర్మన్ వేణుగోపాల్ తప్పుడు పత్రాలు సృష్టించి గద్వాల పట్టణంలో చాలా చోట్ల ప్రభుత్వ ఆస్తులను కబ్జా చేస్తున్నారని వినతిలో పేర్కొన్నారు. తక్షణమే పురాతన బావిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని సంరక్షించాలన్నారు. అదే విధంగా కబ్జాకు పాల్పడుతున్న మాజీ మున్సిపల్ చైర్మన్ వేణుగోపాల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మోహన్ రావు, మధుసూదన్‌బాబు, ప్రభాకర్, సుభాన్, భాస్కర్, రంగన్న, కార్తీక్ వాల్మీకి పాల్గొన్నారు.

నేడు శ్రీమద్ శ్రీశైల జగద్గురువు రాక

అలంపూర్: అలంపూర్ క్షేత్ర ఆలయాలకు శ్రీమద్ శ్రీశైల జగద్గురువు శ్రీశ్రీశ్రీ 1008 చెన్న సిద్ధరామ పండితారాధ్య శివాచార్య గురువు ఈనెల 22న విచ్చేయనున్నట్లు వీరశైవ సంఘం నాయకులు నీలప్ప ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను దర్శించనున్నట్లు పేర్కొన్నారు.

యువకుడికి సన్మానం



గద్వాల: మల్దకల్‌కు చెందిన దామ నందకుమార్ కష్టపడి చదివి ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం గొప్పవిషయమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో నందకుమార్‌ని సన్మానించారు. యువత నందకుమార్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గడ్డం కృష్ణారెడ్డి, రాజారెడ్డి, విజయ్‌కుమార్, యాకోబు, నర్సింహులు, నరేందర్, వెంకటన్న, అజయ్, మధు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఏఓ సక్రియానాయక్ ప్రకటనలో తెలిపారు. చిన్న, సన్న కారు, ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. యాంత్రీకరణ పథకంలో భాగంగా జిల్లాకు రూ.56.88లక్షలు మంజూరు అయినట్లు.. ఇందులో రాయితీ ద్వారా బ్యాటరీస్ స్ప్రేయర్స్ 73, పవర్ స్ప్రేయర్స్ 73, రోటవేటర్స్ 30, సీడ్‌కమ్ ఫెర్టిడ్రిల్ 05, డిస్క్‌హారోకేజ్ వీల్స్ 39, పవర్‌టిల్లర్ 02, స్ట్రాబేలర్స్ 02, ట్రాక్టర్లు 03, బండ్‌ఫార్మర్ 03, పవర్‌వీడ్ 02, బ్రష్‌కట్టర్ 03 రైతులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈనెల 31తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

'పది' పరీక్షలు ప్రారంభం



గట్టు గురుకులంలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ప్రారంభమైన పదో తరగతి వార్షిక పరీక్ష మొదటి రోజు ప్రశాంత నిర్వహించారు. పరీక్ష కేంద్రాల వద్ద అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటలకే విద్యార్థులను పరీక్ష హాలులోకి ఉపాధ్యాయులు అనుమతించారు.

■ గట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, మాచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 499 మంది విద్యార్థులకు గాను 496 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ నల్లారెడ్డి తెలిపారు.

■ కేటీదొడ్డి మండలంలోని నందిన్నె, పాతపాలెం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది పబ్లిక్ పరీక్షకు 343 విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. , శివశంకర్ తదితరులు ఉన్నారు.

■ మల్దకల్ మండల కేంద్రంలోని మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలలో మొదటి రోజు పరీక్షకు 497మంది విద్యార్థులకు గాను 496 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ భాస్కర్‌పాపన్న, సుదర్శన్‌రెడ్డి, నర్సింహారెడ్డి తెలిపారు.

■ ఉండవెల్లి మండల కేంద్రంలోని పదో తరగతి మొదటి రోజు పరీక్షకు మొత్తం మూడు కేంద్రాల్లోని మైనార్టీ గురుకుల పాఠశాలలో 136 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 140 మంది, ప్రాథమిక పాఠశాలలో 131 మంది విద్యార్థులు హాజరైనట్లు మండల కస్టోడియన్ అశోక్ తెలిపారు.

■ ఇటిక్యాల మండల కేంద్రంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షకు వందశాతం విద్యార్థులు హాజరైనట్లు మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.

■ రాజోళి మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 122 విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ఎంఈఓ భగీరథ రెడ్డి తెలిపారు.

■ ఎర్రవల్లి మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షకు 408 మంది విద్యార్థులు హాజరవగా ఒక్క విద్యార్థి మాత్రమే గైర్హాజరైనట్లు మండల విద్యాధికారి అమీర్‌పాషా తెలిపారు. కోదండాపురం 126, కొండేరులో 146, ఎర్రవల్లిలో 136 మంది విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు.

■ మానవపాడు మండల కేంద్రంలో పరీక్షకు 295 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు తెలిపారు.

■ అయిజ మండల కేంద్రంలో ఐదు, మండలంలోని ఉత్తనూరులో ఒక పరీక్ష కేంద్రం నిర్వహించిన పదో తరగతి మొదటి రోజు పరీక్షకు 999 మంది విద్యార్థులు హాజరువావాల్సి ఉండగా 8 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

■ అలంపూర్ అలంపూర్ పట్టణంలోని పరీక్షా కేంద్రాల్లో 306 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 305 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ అశోక్ కుమార్ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎస్ఐ వెంకటస్వామి సిబ్బందితో కలిసి భద్రతను పర్యవేక్షించారు.



అలంపూర్‌లో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు



పాతపాలెంలో పరీక్ష రాయడానికి వెళ్తున్న విద్యార్థులు



ఉండవెల్లిలో..



ఉండవెల్లిలోని హైస్కూల్ నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు



కొండేరులో ..

బాలల హక్కులపై అవగాహన ఉండాలి



హక్కులపై అవగాహన కల్పిస్తున్న లక్ష్మీదేవి

రాజోళి: బాలల హక్కులపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని చైల్డ్ ప్రొటెక్షన్ ఓఆర్‌డబ్ల్యూ లక్ష్మీదేవి అన్నారు. మండలంలోని పచ్చర్ల గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశం వద్ద విద్య, బాలల హక్కులపై అవగాహన కల్పించారు. బాల కార్మికుల గురించి అధికారులకు సమాచారం ఇవ్వాలని, బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడాలని సూచించారు. బాల్య వివాహాలతో అనారోగ్య సమస్యలతో పాటు, వారి బంగారు భవిష్యత్ నాశనమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ కుమార్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ మమత, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

కౌలు రైతులకు రైతుభరోసా ఇవ్వాలి



కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘు నాయకులు

రాజోళి: కౌలు రైతులకు కూడా రైతుభరోసా ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు అన్నారు. శుక్రవారం అలంపూర్ మండల పరిధిలోని ర్యాలంపాడు, సుల్తానాపురం, జిల్లెలపాడు గ్రామాల్లో ప్రజలు, ఉపాధి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు రైతులతో పాటు, కౌలు రైతులకు కూడా రైతుభరోసా ఇస్తామని వాగ్దానం చేసిందన్నారు. బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు లేవన్నారు. ఉపాధి కూలీలకు పనిముట్లు, పనులు జరిగే చోట టెంట్లు, మెడికల్ కిట్లు, ఓఆర్‌ఎస్ పాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఆయా గ్రామాలకు బీటీ రోడ్డు వేయకుండా వదిలేశారని వాటిని పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో జయన్న, నర్సింహా, సురేష్‌బాబు, అంజనేయులు తదిదరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఆర్వో ప్లాంట్ వితరణ



ఆర్వో నుంచి కోరో నీరు అందిస్తున్న దామోదర్‌నాయుడు

మానవపాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కోరమాండల్ జోనల్ హెడ్ మేనేజర్ దామోదర్‌నాయుడు రూ.3 లక్షల విలువైన ఆర్వో ప్లాంట్ వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్, పాఠ్య పుస్తకాలు, నోటుబుక్, డ్రింకింగ్ వాటర్, రైతులకు కావాల్సిన సామగ్రి గతంలో అందజేసినట్లు తెలిపారు. రైతులకు కూడా అన్ని రకాల సహకారం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శివప్రసాద్, జోనల్ హెచ్‌ఆర్ మహేష్‌కుమార్, ట్రెనర్ గోవిందాచారి, గ్రోమోర్ ఏరియా మేనేజర్ ధనుంజయ, వసంత్‌కల్యాణ్, నాయకులు దామోదర్‌రెడ్డి, రోషన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు



శాంతినగర్ పోలీస్ స్టేషన్‌లో ముదిరాజ్ సంఘు నాయకులు

అలంపూర్: మత్స్యకారుల ముందస్తు అరెస్టులు అక్రమమని మత్స్యకార్మికుల సంఘం అధ్యక్షుడు టీ. మద్దిలేటి, నాయకులు నరసింహ్మ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మత్స్యకారులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో మత్స్యకారులను బీసీ–డీ నుంచి బీసీ–ఏకు మారుస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయిస్తామని భరోసా ఇచ్చారని కానీ ఇటీవల ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో మత్స్యకారుల సంక్షేమానికి ఎలాంటి బడ్జెట్ కేటాయించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా రాష్ట్ర మత్స్యకారుల సంఘం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చినట్లు తెలిపారు. అసెంబ్లీ ముట్టడిని అడ్డుకోవడానికి ముందస్తు అరెస్టు చేయడం దారుణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘు నాయకుల అరెస్ట్

శాంతినగర్: చలో అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో తెలుగు ముదిరాజ్ సంఘ నాయకులను శాంతినగర్ పోలీసులు శుక్రవారం ముందస్తు అరెస్ట్ చేశారు. వడ్డేపల్లి మండల పరిధిలోని బుడమొర్సులో తెలుగు ముదిరాజ్ నాయకులను 5 మందిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. న్యాయమైన డిమాండ్ల సాధనకోసం వెళ్తుంటే అరెస్ట్ చేయడం అమానుషమని వారు మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ముదిరాజులు(మత్స్యకారులు)లను బీసీ–డీ నుంచి బీసీ–ఏకు మార్చాలని అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో జిల్లా మత్స్యశాఖ అధ్యక్షుడు గోపాల్, ముదిరాజులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వీరన్న, సిబ్బంది పాల్గొన్నారు.

ఇస్రో సందర్శనకు విద్యార్థులు



శ్రీహరికోట సందర్శనలో విద్యార్థులు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులను ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరి కోటలో నిర్వహిస్తున్న సైన్స్ ఎక్స్‌పోకు ఉపాధ్యాయురాలు శ్రీలక్ష్మీ ఆధ్వర్యంలో వెళ్లారు. ఫిలడెల్ఫియా తెలంగాణ అసోషియేషన్(యూఎస్ఏ), డ్రీమ్ ఫోర్స్ ఫౌండేషన్ (ఎన్ఆర్ఐ)ల ఆధ్వర్యంలో టీఎస్ఓ శ్రీధర్‌తో విద్యార్థినులు వేదవతి, దీక్షితలు వెళ్లారు. విద్యార్థులు శాస్త్రవేతలుగా ఎదగాలంటే ఇలాంటి ప్రదేశాలను తప్పక కనువిప్పు చేస్తుంటాయని వారు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అపస్మారక స్థితిలో గుర్తుతెలియని మహిళ



అపస్మారక స్థితిలో ఉన్న మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

గద్వాల క్రైం: పట్టణంలోని అంబేడ్కర్ చౌక్ సమీపంలో అపస్మారక స్థితిలో పడి ఉన్న గుర్తు తెలియని మహిళను శుక్రవారం సాయంత్రం పట్టణ పోలీసులు జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. స్థానికులు, ఎస్ఐ కల్యాణ్‌కుమార్ కథనం మేరకు... గత కొన్ని రోజులుగా భిక్షాటన చేస్తున్న గుర్తు తెలియని మహిళ బస్టాండ్‌లో రక్త గాయాలతో పడి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు అంబులెన్స్ సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది అక్కడికి చేరుకుని మహిళకు సంబంధించిన వ్యక్తులు ఎవరరూ లేరని తెలుసుకుని అక్కడే వదిలేసి వెళ్లినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సమాచారం అందుకున్న పోలీసులు మహిళను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్థానికులు మహిళను వాకబు చేసిన క్రమంలో కుటుంబ సభ్యులతో ఘర్షణ పడి రాయచూర్ జిల్లా యాపదిన్నె గ్రామం నుంచి వచ్చినట్లు మహిళ తెలిపినట్లు వారు పేర్కొన్నారు.

శ్రీశైల క్షేత్రానికి పాదయాత్రగా భక్తులు



అయిజలో కర్రల సాయంతో నడుస్తున్న భక్తులు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో శ్రీశైల క్షేత్రానికి పాదయాత్రగా వెళ్తున్న కర్ణాటక భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి తెలిపారు.

అయిజ: శ్రీశైలానికి పాదయాత్రగా కర్ణాటకకు చెందిన భక్తుల తరలివెళ్తున్నారు. కొందరు భక్తులు పాదాలకు కర్రలు అమర్చుకొని కర్రలపై నడుస్తూ పాదయాత్ర చేయడం అందరి దృష్టిని ఆకర్షించింది.

గట్టు: పాదయాత్రిలకు సింధగికి చెందిన సేవా సంస్థ రూ.20 లక్షలతో మండల కేంద్రంలోని వీరభద్ర దేవాలయం వద్ద అన్నదానం, వైద్య సేవలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.